ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 16 ఏప్రిల్ 2024

ఉష్ణోగ్రతలు	అనంతపురం
గరిష్ఠం కనిష్ఠం	41.0 25.0



గెలిపిస్తే మూడు నెలల్లో తాగునీరిస్తానని హామీ

తుంగభద్ర నీరు వస్తుందని ఓట్లేసిన జనం

గెలిచాక హామీని విస్మరించిన తోపుదుర్తి

తోపు హామీ.. తుంగలోకి..!

రూరల్ ప్రజలకు రాప్తాడు ఎమ్మెల్యే నామాలు

'అనంతపురం రూరల్ ప్రాంతాలకు తుంగభద్ర జలాలిచ్చి ఆదుకుంటాం.. అధికారం చేపట్టిన మూడు నెలల్లో ఆ పనులు ప్రారంభిస్తా..' అని 2019 ఎన్నికల ప్రచారంలో అప్పటి వైసీపీ రాప్తాడు అభ్యర్థి తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి హామీ ఇచ్చారు. పాపంపేటలో జనం సాక్షిగా ఇచ్చిన హామీ ఇది. ప్రజలు నమ్మి ఓటేశారు. గెలిచి ఎమ్మెల్యే అయ్యాక ఆ హామీకి నీళ్లు వదిలారు తోపుదుర్తి. ఈ ఐదేళ్లూ నిర్లక్ష్యం చేశాడు. తీరా ఎన్నికలకు ముందు.. మూడు నెలల క్రితం హడావుడిగా పైపులైన్ పనులు ప్రారంభించారు. ఎన్నికలు వచ్చేలోపు నీటిని అందిస్తామని నమ్మబలికారు. కానీ ఆ పనులపట్లా నిర్లక్ష్యం వహించారు. ఎన్నికల కోడ్ రాగానే.. నెపం దానిపైకి నెట్టేశారు. ఎన్నికలు పూర్తి అవగానే పనులు ప్రారంభిస్తానని కొత్త నాటకానికి తెర తీశారు. స్థానికులకు తుంగభద్ర జలాలు వస్తాయన్నా కల.. కలగానే మిగిలిపోయింది.

\- అనంతపురంరూరల్





ఒట్టి బిల్డప్పులే..

ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించండి. మూడు నాలుగు నెలలకే మంచినీళ్లు ఇస్తానని తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి పాపంపేటలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసేలేకుండా లేకుండా పోయింది. ఐదేళ్లపాటు నిద్రపోయి.. ఎన్నికలొస్తున్నాయని మళ్లీ బిల్డప్పులు మొదలు పెట్టాడు. ఇదే కాదు... ఇచ్చిన ఏ హామీనీ ఆయన నెరవేర్చలేదు. జనాల ముందు మండల అధికారులకు ఫోన్లు చేసి ఆ పని చేయండి.. ఈ పని చేయండి అంటూ బిల్డప్పులు ఇవ్వడమే తప్ప... చేసింది ఏమీ లేదు.

\- కురుగుంట నారాయణస్వామి, తెలుగురైతు అధ్యక్షుడు, రాప్తాడు నియోజకవర్గం



మళ్లీ మభ్యపెట్టడానికే..

అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మంచినీరిస్తామన్నారు. ఓట్లు దండుకున్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. మళ్లీ ఎన్నికలు దగ్గరకొస్తున్నాయని పీఏబీఆర్ నీళ్ల సరఫరా కోసమంటూ పైపులైన్ పనులు చేపట్టారు. ప్రజలకు నీళ్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ఉంటే ఈ ఐదేళ్లూ ఎందుకు నిర్లక్ష్యం చేశారు. మంచినీళ్ల పేరుతో మళ్లీ ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు. ప్రజలు ఇక నమ్మరు.

\- మేకల వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ

'నన్ను గెలిపించండి..! పాపంపేట, అక్కంపల్లి, కురుగుంట, చిన్నంపల్లి, రాచానపల్లి ప్రాంతాలకు తుంగభద్ర జాలాలిచ్చి ఆదుకుంటా...' అని గత ఎన్నికల సమయంలో తోపు వీర ప్రగల్భాలు పలికారు. పార్టీ అధికారంలోకి రాగానే ఆ హామీని ఏ మాత్రం పట్టించుకోలేదు. తాగునీటి సమస్యపై పలు గ్రామాలు గగ్గోలు పెట్టినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇలా నాలుగున్నర ఏళ్లు గడిచాయి. తిరిగి ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇచ్చిన హామీలపై దృష్టిసారించారు. రూరల్ మండలంతోపాటు, ఆత్మకూరు మండలంలోని యాలేరు, ముట్టాల, కొత్తపల్లి, సింగంపల్లి, పంపనూరు, వడ్డుపల్లి, మదిగుబ్బ, సనప తదితర ప్రాంతాలకు పీఏబీఆర్ నీటి సరఫరా చేసేందుకు జలజీవన్ మిషన్ పథకం కింద పనులు చేపట్టారు. దాదాపు 1.20 కోట్ల లీటర్ల నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఆత్మకూరు మండలంలోని ప్రాంతాల్లో పనులకు రూ.54 కోట్లు, అనంతపురం రూరల్ ప్రాంతాల్లో పనులకు రూ.41 కోట్లు కేటాయించారు. ఎన్నికల లోపే నీళ్లిచ్చి.. హామీని

ఈ ఐదేళ్లూ నిర్లక్ష్యం చేసి...

నిలుపుకుంటానని మళ్లీ నమ్మబలికారు. అయితే పనులు అతి నెమ్మదిగా సాగాయి. ప్రస్తుతం పనులు ఎక్కడికక్కడే నిలిపోయాయి. కోడ్ రావడంతో పూర్తి ఆగిపోయాయి. దీంతో ఇదంతా ఎన్నికల్లో ఓట్లకోసమేనా ఈ హామీలు అని ప్రజలు పెదవిరిస్తున్నారు.


చిన్నంపల్లి సమీపంలో నిరుపయోగంగా పైపులు

వాల్మీకుల ద్రోహి తలారి రంగయ్య

ఎస్టీ జాబితాలో చేర్చకుండా అడ్డుపడ్డారు

మంత్రికి భయపడి ఐదేళ్లు కళ్యాణదుర్గానికి రాలేదు

వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో కాలవ శ్రీనివాసులు


వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 15: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకుండా అడ్డుపడి, పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టకుండా అడ్డుకున్న వాల్మీకుల ద్రోహి.. ఎంపీ తలారి రంగయ్య అని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద సోమవారం నిర్వహించిన వాల్మీకుల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీఎత్తున వాల్మీకులు, ఆ సామాజికవర్గ మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, మంత్రి ఉషశ్రీచరణ్‌కు భయపడి ఐదేళ్లపాటు తలారి రంగయ్య కళ్యాణదుర్గంవైపు కన్నెత్తి చూడలేదని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయని రంగయ్య, ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించారు. తలారి రంగయ్య ఒక అసమర్థుడని మండిపడ్డారు.


ఆత్మీయ సమావేశంలో వాల్మీకులు

మీలో ఒక్కడిని: అమిలినేని

'మీలో ఒక్కడిగా ఉంటూ.. కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శక్తి వంచనలేకుండా కృషి చేస్తా' అని టీడీపీ కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎంతో వెనుకబడి ఉందని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజల కలలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. బీటీపీ కాలువకు చంద్రబాబునాయుడు భూమిపూజ చేస్తే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పనులను భూస్థాపితం చేశారని మండిపడ్డారు. నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని విమర్శించారు. జగన్ వచ్చిన ప్రతి సారీ అదిగో చేస్తాం ఇదిగో చేస్తాం అని మాయమాటలు చెప్పి వెళ్లారే తప్ప, పనులేమీ చేయలేదని అన్నారు. బీటీపీ కాలువను పూర్తి చేసి, ప్రతి చెరువుకూ నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏపీఐఐసీ తీసుకున్న భూముల్లో టమోటా ప్రాసెసింగ్ యూనిట్, గార్మెంట్స్ పరిశ్రమలను ఏర్పాటు చేసి, యువతీయువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు వేసుకుని, మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు.

ఐక్యంగా ఉందాం: అంబికా

2017 డిసెంబరు 2న వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయించి, కేంద్రానికి పంపిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందని టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. దీనిపై వైసీపీ ప్రభుత్వం ఏకసభ్య కమిటీ వేసి, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకుండా ద్రోహం చేసిందని అన్నారు. 'మనమందరం ఐక్యంగా ఉందాం. టీడీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలి' అని వాల్మీకులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ కాంప్లెక్స్ గదులు సీజ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాయదుర్గం, ఏప్రిల్ 15: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో రూ.25 లక్షలతో నిర్మించిన జడ్పీ కాంప్లెక్స్ గదులను సీజ్ చేశామని డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి తెలిపారు. 'వైసీపీ నేతల దర్జా' పేరిట ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెండేళ్లుగా వైసీపీ నాయకుల కబ్జాలో ఉన్న జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌ను డిప్యూటీ సీఈఓ సోమవారం సందర్శించారు. కాంప్లెక్స్‌లోని ఎనిమిది గదులను సీజ్ చేసినట్లు గతంలో ఎంపీడీఓ అల్లాబకాష్ నివేదిక ఇచ్చారని, దానిపై విచారించి, జడ్పీ సీఈఓకు నివేదిక ఇస్తామని అన్నారు. ఉన్నతాధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారని వెల్లడించారు.


అధికారులు, కాంట్రాక్టర్‌ను నిలదీస్తున్న హౌసింగ్ లబ్ధిదారులు

మీతో కాదులే..!

మా డబ్బులు మాకు ఇప్పించండి

అధికారులు, కాంట్రాక్టర్‌తో హౌసింగ్ లబ్ధిదారులు

యాడికి, ఏప్రిల్ 15: 'మీరు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేరు. మాతో కట్టించుకున్న అదనపు డబ్బులు మాకు ఇచ్చేయండి చాలు..' అని అధికారులు, కాంట్రాక్టర్‌ను హౌసింగ్ లబ్ధిదారులు నిలదీశారు. యాడికి ఎంపీడీఓ కార్యాలయం వద్ద బాధితులు సోమవారం అధికారులతో వాగ్వాదానికి దిగారు. జగనన్న ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పిన అధికారులు, వాటిని పూర్తిచేయకపోవడంతో మరోమారు ఆందోళనకు దిగారు. ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈని నిలదీశారు. తమతో కట్టించుకున్న రూ.35వేల అదనపు డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడుతామని అధికారులు చెప్పారు. కాంట్రాక్టర్‌ను ఇప్పుడే పిలిపించాలని కోరుతూ లబ్ధిదారులు అక్కడే బైఠాయించారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో కాంట్రాక్టర్‌ను పిలిపించి, లబ్ధిదారులతో అధికారులు సమావేశం నిర్వహించారు. అక్కడ సైతం లబ్ధిదారులు ఒకే మాటపై నిలబడ్డారు. తమ ఇళ్లను తామే కట్టుకుంటామని, కాంట్రాక్టర్ కట్టించి ఇస్తారన్న నమ్మకం లేదని స్పష్టం చేశారు. దీంతో కాంట్రాక్టర్‌కు, లబ్ధిదారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు అధికారులు కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరిపి, లబ్ధిదారుల అదనపు డబ్బులను వెనక్కి ఇచ్చేలా ఒప్పించారు. ఇళ్లను ప్రభుత్వమే కట్టించి ఇస్తుందన్న హామీలను నమ్మి తాము మోసపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ కాలయాపన చేస్తూ తమను మోసగించారని మండిపడ్డారు. యాడికి పట్టణంలో సుమారు 600 జగనన్న ఇళ్లను మంజూరు చేశారు. ఆప్షన్ త్రీ కింద ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ప్రకటించారు. ప్రభుత్వం సమకూర్చే సొమ్ము కాకుండా, ఒక్కో లబ్ధిదారు నుంచి కాంట్రాక్టర్‌కు రూ.35వేల అదనంగా ఇవ్వాలని సూచించారు. దీంతో సుమారు 120 మంది అదనపు సొమ్ము చెల్లించారు. కానీ ఇప్పటి వరకూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో కొన్ని నెలల నుంచి లబ్ధిదారులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు.


ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈతో లబ్ధిదారుల వాగ్వాదం

ఇంకెప్పుడు జగనన్నా..!

ఆసరా బటన్ నొక్కి.. రెండున్నర నెలలు

సంఘాల ఖాతాలో ఇప్పటికీ జమకాని సొమ్ము

బ్యాంకుల చుట్టూ పొదుపు మహిళల ప్రదక్షిణ

వైసీపీ సానుకూల సంఘాలకు ఇచ్చారని ఆరోపణ



శింగనమల, ఏప్రిల్ 15:
ఆసరా సొమ్ము కోసం మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. సీఎం జగన్ బటన్ నొక్కి రెండున్నర నెలాలు గడిచినా.. ఇంకా బ్యాంకులలో సొమ్ము జమకాలేదు. దీంతో మహిళ సంఘాల సభ్యులు ఆ సొమ్ము కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఎప్పుడు పడుతుందో తెలియక ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ ఏడాది జనవరి 23న ఉరవకొండలో వైఎస్సార్ ఆసరా సభను నిర్వహించారు. సీఎం జగన్ స్వయంగా హాజరై.. సొమ్ము విడుదల బటన్ నొక్కారు. నెలలు గడిచినా డబ్బు బ్యాంకు ఖాతాలకు చేరకపోవడంతో ఇదంతా ఎన్నికల డ్రామా అని మహిళలు మండిపడుతున్నారు. రాజకీయ లబ్ధికోసం వైసీపీ ప్రభుత్వం తమతో ఆడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శింగనమల మండలంలో 630 మహిళా సంఘాలు ఆసరా లబ్ధిదారుల జాబితాలో ఉన్నాయి. ఇప్పటి వరకు 435 మహిళా సంఘాల ఖాతాలలో మాత్రమే డబ్బులు జమ అయ్యాయని అధికారులు చెపుతున్నారు. ఇంకా 195 మహిళా సంఘాలకు డబ్బులు అందాల్సి ఉంది.

వైసీపీ సానుకూల గ్రూపులకే..

శింగనమల మండలంలోని సి.బండమీదపల్లిలో 16 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు కేవలం ఆరు గ్రూపులకు మాత్రమే ఆసరా సొమ్ము జమ అయ్యింది. అధికార పార్టీ నాయకుల భార్యలు సభ్యులుగా ఉన్న సంఘాలకు మాత్రమే సొమ్ము జమ అయిందని బాధితులు ఆరోపిస్తున్నారు. శ్రీలక్ష్మీనరసింహ, కల్పన, సత్యసాయి, శ్యామల, వెంకటేశ్వర, శ్రీలక్ష్మి సంఘాలకు మెదటి విడతలో సొమ్ము జమ అయింది. మిగిలిన సంఘాల ఖాతాలకు ఇంత వరకు సొమ్ము జమ కాలేదు. సొమ్ము అందినవన్నీ వైసీపీ సానుకూల గ్రూపులని, అందుకే వారికి త్వరగా సొమ్ము జమ చేశారని, తమకు అన్యాయం చేస్తున్నారని మిగిలిన సంఘావారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వస్తాయో.. రావో..

బటన్ నొక్కి నెలలు గడిచింది. ఇంత వరకు మా సంఘాలకు ఆసరా డబ్బులు జమ కాలేదు. అధికారులను అడిగితే ఈ రోజు.. రేపు అని కాలం గడుపుతున్నారు. మా గ్రామంలో ఆరు గ్రూపులకు సొమ్ము జమ అయింది. వారు డబ్బులు తీసుకున్నారు. ఎన్నికలు వస్తున్నాయి. మాకు డబ్బులు వస్తాయో రావో తెలియడంలేదు.

\- సునీత సి.బండమీదపల్లి



రాజకీయం ఉంది..

ఆసరా బటన్ నొక్కి నెలలు గడిచినా మా గ్రూపు వాళ్లకు ఆసరా డబ్బులు జమ కాలేదు. అధికార పార్టీవారి గ్రూపులకు మెదటి విడతలోనే సొమ్ము జమ అయ్యింది. దీని వెనుక ఖచ్చితంగా రాజకీయం ఉంది. ఈరోజు వరకు మా గ్రూపులకు సొమ్ము జమ కాలేదు. అధికారులు వెంటనే ఆసరా డబ్బులను జమ చేయాలి.

\- లక్ష్మీనారాయణమ్మ, సి.బండమీదపల్లి



రోజూ తిరుగుతున్నాం..

రెండన్నర నెలలు నుంచి ఆసరా డబ్బుల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాం. మా గ్రూపునకు సొమ్ము జమ కాలేదు. మా ఊరిలో 16 గ్రూపులు ఉంటే.. మెదటి విడత ఆరు గ్రూపులకు మాత్రమే డబ్బులు జమ అయ్యాయి. అప్పటి నుంచి వారంలో రెండు రోజులు కార్యాలయానికి వెళ్లి వస్తున్నాం. ఇంకా ఎన్ని రోజులు పడుతుందో తెలియడంలేదు.

\- రామాంజినమ్మ, సి.బండమీదపల్లి

అన్ని సంఘాలకూ వస్తుంది..

శింగనమల మండలంలో 75శాతం గ్రూపులకు ఆసరా డబ్బులు డబ్బులు జమయ్యాయి. ఇంకా 195 గ్రూపులకు జమ కావాల్సి ఉంది. రెండు మూడు వారాల్లో అన్ని గ్రూపులకూ సొమ్ము జమ అవుతుందని అధికారులు చెబుతున్నారు. మహిళలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. అన్ని సంఘాలకూ సొమ్ము జమ అవుతుంది. - నారాయణస్వామి, ఏపీఎం

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



18 నుంచి నామినేషన్ల స్వీకరణ

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకూ..

అభ్యర్థులు గమనించి.. సహకరించాలి..

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 15:
పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జేసీ కేతన్ గార్గ్, నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్, సివిల్ సప్లై డీఎం రమేష్‌రెడ్డితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తగిన డాక్యుమెంట్లతో వచ్చి నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. ఆ సమయంలోగా కార్యాలయం లోపల ఉన్నవారికి 3 గంటల తరువాత కూడా నామినేషన్లు వేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా నామినేషన్‌లు స్వీకరించే కార్యాలయాల లోపలికి అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని సూచించారు. నామినేషన్లకు 13 రకాల డాక్యుమెంట్లు అందించాల్సి ఉంటుందని, ఆర్ఓ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ పెట్టి, ఏవైనా డాక్యుమెంట్స్ లేకపోతే అభ్యర్థులకు తెలియజేస్తామని అన్నారు. ఆ డాక్యుమెంట్స్‌ను 25వ తేదీలోగా తెచ్చి ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. ఆ లోగా తెచ్చి ఇవ్వకపోతే పరిశీలన తరువాత నామినేషన్లను తిరస్కరిస్తామని స్పష్టం చేశారు.

ఖర్చులపై నిఘా

పార్టీలు, అభ్యర్థుల ఖర్చులపై ప్రత్యేక నిఘా ఉంచుతామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. పార్టీలు, అభ్యర్థులు, ఏజెంట్లు తగిన సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ప్రజలు నేరుగాగాని, సి-విజిల్ యాప్ ద్వారాగానీ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి, వంద నిమిషాలలో పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించినట్లు తేలితే.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

విచారణ జరుగుతోంది

అనంతపురం రూరల్ ఎంపీడీఓపై వచ్చిన ఆరోపణల గురించి విచారణ జరుగుతోందని, నివేదికలు వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని కలెక్టరు వినోద్ కుమార్ తెలిపారు. ఓటరు నమోదు వ్యవహారంలో ఆర్ఓపై కూడా విచారణ జరుగుతోందని అన్నారు. కొందరు పోలీసులపైనా ఫిర్యాదులు వచ్చాయని, విచారణ కోసం జిల్లా ఎస్పీకి పంపించామని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వలంటీర్లపై ఆరోపణలు వస్తే.. విచారించి వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

దీపం ఉండగానే..!

అధికారం ఎన్నాళ్లుంటుందో తెలియదు. ఎన్నికల తరువాత పరిస్థితి ఏమిటో తెలియదు. అందుకే.. ఉన్నన్నాళ్లూ సాధ్యమైనంత తవ్వి.. అమ్ముకుందామని తెగబడుతున్నారు అధికార పార్టీ నాయకులు. ఇసుక అక్రమ తవ్వకాలను ముమ్మరం చేశారు. సరిహద్దులను దాటించేందుకు ఎన్నికల చెక్‌పోస్టులు అడ్డుగా ఉండడంతో గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజలకు అమ్ముకుంటున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని ఉద్దేహాళ్, కళ్లుదేవనహళ్లి, బొల్లనగుడ్డం తదితర గ్రామాల శివారులో ఉన్న వేదవతి హగరి నది నుంచి ఇసుకను అక్రమంగా తవ్వి విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను ఐదు వేలకు అమ్ముతున్నారు. వైసీపీ ముఖ్య నాయకుల అండతో గ్రామీణ ప్రాంతాలలో ఉండే చోటా నాయకులు ఇసుక దందా నడిపిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. ప్రభుత్వ పనుల కోసం అని బుకాయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు.

\- బొమ్మనహాళ్


ఇలా రోజూ తరలిస్తున్నారు..





దోపిడీకి లైసెన్స్!

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా ఖనిజాల తరలింపు

- వైసీపీ నాయకుడి సంస్థకు రెండేళ్ల అనుమతి
- ఖనిజ సంపదను కొల్లగొడుతున్న 'అమిగోస్'
- నిబంధలకు విరుద్ధంగా తవ్వకాలు.. రవాణా
- నష్టపోతున్న ఇతర ప్రాంత లీజుదారులు



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15: దోపిడీకి లైసెన్స్ ఇచ్చినట్లుగా అమిగోస్ సంస్థ యథేచ్ఛగా జిల్లాలో ఖనిజసంపదను తవ్వేస్తోంది. ఉమ్మడి జిల్లాలో రెండేళ్ల తవ్వుకోవడానికి ఆ సంస్థకు అనుమతులిచ్చేశారు. ఇందుకుగాను ఆ సంస్థ ప్రభుత్వానికి రూ.259 కోట్లు చెల్లించాల్సి ఉంది. కడపకు చెందిన అధికారపార్టీ నాయకుడు, అనంతపురం నగరంలో ఓ కార్ల షోరూం యజమాని, సీఎంకు, పెద్దమంత్రికి ఆప్తుడు ఈ అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థలో భాగస్వాములుగా ఉన్నారు. ఈ సంస్థకు జిల్లాలోని కంకర, మట్టి, లేటరైట్, డోలమైట్, గ్రానైట్ ఖనిజాలపై పూర్తి హక్కులు కల్పించారు. ఆ సంస్థ మాత్రమే ఖనిజాలు తవ్వి, రవాణా చేసుకుంటూ వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి. కానీ అమిగోస్ సంస్థ అనుమతికి మించి ఖనిజాలను తవ్వేస్తోంది. అలాగే స్థానికంగా తాత్కాలిక లీజుల పేరుతో అనుమతి తీసుకున్నట్లు పేపర్లను చూపుతూ యథేచ్ఛగా ఇతర జిల్లాలకు గ్రావెల్ తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. దీంతో ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో లీజులు పొందినవారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదంతా ఆ సంస్థలోని వారు వైసీపీలో ఉండటంతోనే సాధ్యమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా వైసీపీ కళ్యాణదుర్గం అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులుగా అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ ఎండీ మల్లు ప్రసాద్‌రెడ్డిని నియమించడాన్ని చూపుతున్నారు.

అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థకు జిల్లాలో ఖనిజ వనరులు తవ్వుకోవడానికి అనుమతి నిరాకరించిన జిల్లా గనులు భూగర్భశాఖ ఉపసంచాలకులపై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. గతేడాది మార్చి నెలలో ఇన్‌చార్జి డీడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యం అమిగోస్ మినరల్స్‌పై ఆసక్తి చూపలేదని ఆయన్ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలు డీడీ తలారి రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత వారానికే అమిగోస్ లైసెన్సు అగ్రిమెంట్‌కు సంబంధించి రాష్ట్ర శాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆ అగ్రిమెంట్‌పై డీడీ రాజశేఖర్ సంతకం చేయకపోగా, ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉంది, ఇలా చేయరాదని తిరస్కరించారు. దీంతో డీడీ బాధ్యతలు రాజశేఖర్‌కు తప్పించి వెంటనే అనంతపురం ఏడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యానికి తిరిగి అప్పగించారు. వారం రోజులు తిరక్కముందే ఇన్‌చార్జి డీడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యం ఎండీఎల్ కు సంబంధించి అగ్రిమెంట్‌ను తిరస్కరించారు. దీంతో ఇన్‌చార్జి డీడీ తోట బాలసుబ్రహ్మణ్యాన్ని వెంటనే సెలవుపై పంపించాలని అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధి ఒత్తిడి చేయడంతో గనులు భూగర్భశాఖ డైరెక్టరేట్ నుంచి సెలవు మంజూరు చేశారు. ఈ క్రమంలోనే తాడిపత్రి ఏడీగా ఉన్న ఎంపరాల నాగయ్యను ఇన్‌చార్జి డీడీగా నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ఖనిజ సంపద కొల్లగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీఎల్‌తో మరెంతమంది అధికారులు బలి అవుతారోననే చర్చ ఆ శాఖలో తీవ్రంగా జరుగుతుండటం గమనార్హం. కాగా అనంతపురం ఏడీగా ఉన్న తోట బాలసుబ్రహ్మణ్యాన్ని ఆ పదవి నుంచి కూడా తప్పించి ఏజీగా ఉన్న రామకృష్ణ ప్రసాద్‌ను ఇన్‌చార్జి ఏడీగా నియమించారు.

అనుమతికి నిరాకరించిన అధికారులపై బదిలీ వేటు

ప్రైవేటు మోజులో ప్రభుత్వం

అమిగోస్ సంస్థపై ప్రభుత్వానికి మోజు అధికమైంది. ఈ సంస్థ కోసం ప్రభుత్వం జిల్లాలో సుమారు 40 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనం. తాడిపత్రికి నాలుగువైపులా చుక్కలూరు, రాయలచెరువు, క్రిష్టిపాడు-గుత్తి రోడ్డులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే తాడిపత్రి నుంచి కడప, అనంతపురం, కొలిమిగుండ్ల, చుక్కలూరుకు వెళ్లే ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ప్రారంభించారు. రాయలచెరువు, క్రిష్టిపాడులలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే ఇదివరకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయలేకపోయారు? ప్రైవేటు సంస్థ అమిగోస్‌కు లీజు ఇచ్చిన వెంటనే ఏర్పాటు చేయడంపై ఆశాఖ పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..

ప్రభుత్వ ఆదేశాల మేరకే జిల్లాలో అమిగోస్ మినరల్స్ ప్రైవేటు సంస్థ ఖనిజ తవ్వకాలు, రవాణా చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సర్వ హక్కులు అమిగోస్ మినరల్స్‌కు రాష్ట్ర ఉన్నతాధికారులు అప్పగించారు. వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి లీజు రూపంలో చెల్లిస్తున్నారు. తాత్కాలిక లీజులు అంటూ ఏమి ఉండవు. అమిగోస్‌కు ఇచ్చిన లీజులోనే మట్టి తరలింపు జరుగుతుంది. చెక్‌పోస్టులలో అనుమతి లేని తవ్వకం, రవాణా చేసే వాహనాల నుంచి రాయల్టీ వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లిస్తారు.



- నాగయ్య, జిల్లా భూగర్భగనుల శాఖ డీడీ

1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15: జిల్లాలో మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు-2024 నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ షఫీ తెలిపారు. మొత్తం 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహించాలని శాప్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. అయితే ఇప్పటి వరకు 58 మంది కోచ్‌లు శిబిరాల నిర్వహణకు ముందుకు వచ్చారని తెలిపారు. కోచ్‌ల నుంచి వచ్చిన దరఖాస్తులను శాప్ అధికారులకు పంపామని, శాప్ నుంచి వచ్చే అనుమతి మేరకు సమ్మర్ క్యాంపులు ఉంటాయన్నారు.

బైక్ రిపేరీలో ఉచిత శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15: బైక్ రిపేరీపై ఉచిత శిక్షణ ఇస్తామని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, పది, ఇంటర్, ఐటీఐ చదివిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఇంగ్లిష్‌లో నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఉచితంగా టూల్‌కిట్‌తో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9390505952, 7780752418 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గతమే ఘనం

- టీడీపీ పాలనలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు
- 17 ఏకరాల్లో 55 యూనిట్లకు వసతుల కల్పన
- ఔత్సాహికులకు రుణాలు, రాయితీలు
- భిన్న రీతుల్లో జీన్స్ ప్యాంట్ల తయారీ
- అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ సర్కారు
- ఎన్నికల వేళ ఓడీ-ఓపీ ద్వారా ప్రచార ఆర్భాటం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15: దేశంలోని నలుమూలలు, విదేశాలకు జీన్స్ ప్యాంట్లను ఎగుమతి చేసేలా టీడీపీ ప్రభుత్వం జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకు రాయదుర్గం పట్టణ సమీపాన 17ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ స్థలంలో జీన్స్ వస్త్రాల తయారీకి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించింది. ఇందులో భాగంగా 55 యూనిట్లను ఏర్పాటుచేసేలా ఒక్కో యూనిట్‌కు 20 సెంట్ల చొప్పున స్థలాన్ని కేటాయించింది. యూనిట్ల కోసం శాశ్వత భవనాలను నిర్మించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) అప్రూవల్స్ ఇప్పించింది. దీంతో టెక్స్‌టైల్ పార్క్‌ద్వారా రోజుకు సగటున 60వేల జీన్స్ ప్యాంట్లు తయారవుతున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. వీరితోపాటు వందల కుటుంబాలు కుటీర పరిశ్రమలాగా వారి ఇళ్లనుంచే స్టిచింగ్, కటింగ్, కలరింగ్, ఐరన్ తదితర పనుల చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాయి. ఇదంతా గతం. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి ఎలాంటి ప్రోత్సాహకం అందడంలేదు. ముఖ్య మంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచే పెట్టుబడి రుణాలను, రాయితీలను ఎత్తివేశారు. కనీసం మార్కెటింగ్ సదుపాయాన్ని కూడా కల్పించడంలేదని ఇటు యూనిట్ల వ్యవస్థాపకులు, జీవనోపాధి పొందుతున్న వర్గాలు వాపోతున్నాయి.

రూ.500కోట్ల టర్నోవర్...

టెక్స్‌టైల్ పార్క్ ఏడాదికి రూ.500 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. తద్వారా ట్యాక్స్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం లభిస్తోంది. గుజరాత్‌లోని అహ్మదా బాద్ వస్త్రతయారీ పరిశ్రమ నుంచే నేరుగా ముడి వస్త్రాన్ని టన్నుల్లో తీసుకువస్తారు. అనంతరం ప్యాంట్స్‌ను తయారుచేసి ఎగుమతి చేస్తారు. ఈ ప్రక్రియలో రవాణా, మార్కెట్, అమ్మకాలు తదితర రూపాల్లో పన్నుల ద్వారా రాష్ట్ర ఖజా నాకు ఆదాయం జమ అవుతుందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఆకట్టుకునే స్టైల్స్...

యువతను ఆకట్టుకునేలా జీన్స్ ప్యాంట్స్ టెక్స్‌టైల్ పార్కులో తయారవుతున్నా యి. కార్గో, టీసీ ప్యాంట్లు, టెరీ కాటన్, బర్ముడా బూట్‌కట్, కంఫర్ట్, పెన్సిల్ కట్, హాప్ తదితర డిజైన్లతో ప్యాంట్లు తయారు చేస్తున్నారు. వాటిపై వెల్‌వెడ్ అప్లిక్ వర్క్, లెదర్ అప్లిక్ వర్క్, ఫోమ్‌ఎంబోజ్, కమికల్ ఎంబోజ్, ప్రింటెడ్ వంటి రకరకాలతో ఆకృతుల అందాలద్ది యువతను ఆకర్షిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, గోవా వంటి ప్రాంతాలతోపాటు ఇతర దేశాలకు చెందిన పలు బ్రాండెడ్ జీన్స్ కంపెనీలు, మాల్స్ నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. ఒక్కో ప్యాంట్ రూ.250 నుంచి రూ.600లకే తయారుచేసి ఇవ్వడంతో ఆర్డర్లు ఇచ్చేందుకు కంపెనీలు ఎగబడుతుంటాయి. తయారీ ధరలను బట్టి మార్కెట్‌లో ఒక్క ప్యాంట్ రూ.2వేల వరకు అమ్ముకుంటారు.



ముడి సరుకు

జగన్ ప్రభుత్వ సహాయ నిరాకరణ...

టెక్స్‌టైల్ పార్కులో పరిశ్రమలు ఏర్పాటుచేసే వారికి పలు బ్యాంకు లు దాదాపు రూ.కోటి వరకు ఆర్థికసాయం చేయగా, పరిశ్రమల శాఖ రాయితీలను ఇచ్చింది. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు యూనిట్ రుణంలో 50శాతం, పురుషులకైతే 40 శాతం రుణం మంజూరు చేసింది. బీసీ మహిళలకు 45శాతం, పురుషులకు 35శాతం, ఇతరుల కు చెందిన మహిళలకు 20శాతం, పురుషులకు 15శాతం రాయితీలను మంజూరు చేసిందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుతో అన్నిరకాల సహాయ, సహకారాలను ఎత్తివేశారని మండిపడుతున్నారు. ముడిసరుకు ధరలు, తయారీ ఖర్చులు పెరిగి గిట్టుబాటు కాకపోవ డంతో యూనిట్లు మూతవేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.



క్లాత్‌ను కట్ చేస్తున్న కార్మికుడు

ప్రచార ఆర్భాటం

క్షేత్రస్థాయిలో టెక్స్‌టైల్ పార్కు దుస్థితి ఇలా ఉంటే వైసీపీ ప్రభుత్వం మరోలా ప్రచారం చేసుకుంటోంది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తయారవుతున్న ఉత్పత్తులకు కేంద్రప్రభుత్వం ఓడీ-ఓపీ(వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్) ద్వారా ప్రచారాన్ని కల్పిస్తోంది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా 762 జిల్లాలో 1102 ఉత్పత్తులను ఎంపికచేసింది. ఏపీలో 13ఉమ్మడి జిల్లాలనుంచి 38ఉత్పత్తులను ఎంపికచేశారు. వీటిలో అనంతపురం ఉమ్మడి జిల్లానుంచి రాయదుర్గం జీన్స్ పరిశ్రమతో పాటు ధర్మవరం పట్టుచీరలు, నిమ్మలకుంట తోలు బొమ్మల ఉత్పత్తులను ఓడీ-ఓపీలోకి చేర్చింది. ఈ మూడు రంగాలు అంతర్జాతీయంగా జిల్లాకు పేరు ప్రఖ్యాతులను తెచ్చిపెట్టాయి. వైసీపీ ప్రభుత్వం ఇన్నాళ్లు ఎటువంటి సాయం చేయకపోగా ఎన్నికవేళ గొప్పలు చెప్పుకోవడానికి మీ ఫొటోలు, మాటలు వీడియో రూపంలో పంపాలని చెబుతోందని టెక్స్‌టైల్ పార్కు వర్గాలు మండిపడుతున్నాయి.



ప్యాంట్స్‌కు చేతిపనులు చేస్తున్న మహిళ



జీన్స్‌ప్యాంట్స్ తయారీలో నిమగ్నమైన కార్మికులు

వలంటీర్ల బరితెగింపు

జిల్లాలో పలువురు వలంటీర్లు, రేషన్ డీలర్లు బరితెగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మరి కొందరు వలంటీర్లయితే వైసీపీకి ఎన్నికల ప్రచారం చేయడం కోసం మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రొళ్ల, ఏప్రిల్ 15: మండలంలో వలంటర్ దేవరాజు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, జడ్పీటీసీ అనంతరాజ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సోమవారం భాజయ్య పాళ్యం, కాకి పంచాయతీలో నిర్వహించిన ప్రచారం పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ దేవరాజు

ఆర్‌బివంకలో వలంటీర్లు, డీలర్లు..

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో ఈ నెల 13న జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పలువురు వలంటీర్లు, డీలర్లు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన మంజునాథ్‌నాయక్, పాపారాజునాయక్, భోజరాజు, డీలర్ జగదీష్‌నాయక్ ప్రచారంలో పాల్గొనడం గ్రామంలో చర్చనీయాంశమైంది.



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు, డీలర్లు

102 మంది వలంటీర్ల రాజీనామా

కదిరి అర్బన్, ఏప్రిల్ 15: మండలంలో 102మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ అంజనప్పకు అందించారు. మండలంలో 187మంది వలంటీర్లు ఉండగా ఇప్పటికే ఐదుగురు రాజీనామా చేయగా ప్రచారంలో పాల్గొన్న ఏడుగురిని విధులనుంచి తొలగించిన విషయం తెలిసిందే.



ఎంపీడీఓకు రాజీనామాపత్రాన్ని అందజేస్తున్న వలంటీర్లు

● బెళుగుప్ప మండలంలోని శ్రీరంగాపురం సచివాలయం పరిధిలో పనిచేస్తున్న తొమ్మిదిమంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. గ్రామ సెక్రెటరీ శ్రీరాములుకు రాజీనామాపత్రాన్ని అందజేశారు.

ఒకరి తొలగింపు

గోరంట్ల, ఏప్రిల్ 15: ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన మండలంలోని గుత్తివారిపల్లి వలంటీర్ రమ్యను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ, ఎంసీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. మంత్రి ఉషశ్రీచరణ్ శనివారం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తుండగా ఆమెతో వలంటీర్ రమ్య సెల్ఫీ దిగారు. ఈ ఫొటోతో స్థానికులు సీ విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరిశీలించి వలంటీర్‌కు నోటీసుల జారీ చేశారు. సంజాయిషీ కోరిన అనంతరం సోమవారం వలంటీర్‌ను తొలగిస్తూ ఎంపీడీఓ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ఎనిమిది మంది వలంటీర్లు తమ రాజీనామాలను ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అందించినట్లు అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 443 మంది వలంటీర్లుండగా, ఇప్పటివరకు 146మంది రాజీనామా చేశారు.

ఆకట్టుకున్న చాందినీ బండ్ల మెరవణి

● భక్తులతో కిటకిటలాడిన వేమన ఆలయం

గాండ్లపెంట, ఏప్రిల్ 15: యోగి వేమన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజు ప్రత్యేకంగా అలంకరించిన చాందినీ బండ్ల మెరవణి ఆకట్టుకుంది. మండలంలోని కుటాగుళ్లలో యోగివేమన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రెండో రోజు భక్తులు ఎద్దుల బండ్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం పానకం సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయం కిక్కిరిసింది. రాత్రి చాందినీ బండ్ల మెరవణి చేశారు. పురవీధుల్లో తిరిగి ఆలయం వరకు బండ్ల మెరవణి సాగింది. బండ్ల ముందు కళాకారులు కోలాటం చేశారు. ఆర్కెస్ట్రా భక్తులను అలరించింది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ క్రిష్ణవేణి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



అలంకరణలో చాందినీ బండి

ఆధారాలు లేని నగదు పట్టివేత

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 15: కంబదూరు మండలంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద సోమవారం పోలీసులు రూ.1.3 లక్షలు సీజ్ చేశారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా సరైన బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేసి డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామికి అప్పగించారు.



కంబదూరు చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్న డబ్బు చూపుతున్న అధికారులు

రూ.3.08 లక్షలు

అనంతపురం క్రైం: స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన శివశంకర్ నాయక్ ఎలాంటి ఆధారాలూ లేకుండా రూ.3.08 లక్షలు తీసుకెళ్తుండగా అనంతపురం టూటౌన్ పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ రుషేంద్రబాబు నగరపాలిక కార్యాలయం ఎదుట వాహనాల తనిఖీ చేస్తుండగా.. ఈ నగదును గుర్తించారు. ఆ డబ్బును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 15: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,293 టన్నుల చీనీ కాయలు వచ్చాయని వెల్లడించారు.





పాస్టర్లకు అందని వేతనం

- మూడు నెలలుగా నిరీక్షణ
- రూ.అర కోటికిపైగా పెండింగ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్15: జిల్లాలో మూడు నెలుగా పాస్టర్ల వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. నెలకు ఇచ్చే రూ.ఐదు వేలు కూడా సక్రమంగా ఇవ్వకుండా పెండింగ్ పెడితే ఎలా బతకాలని పలువురు పాస్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీ కార్పొరేషన్ నుంచి మూడు నెలలకు సంబంధించి రూ. అరకోటికి పైగా బిల్లులు రాష్ట్రశాఖకు పంపినప్పటికీ ఇంత వరకూ నిధులు విడుదల కాలేదు. దీంతో ఆ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

జనవరి నుంచి పెండింగ్

జిల్లావ్యాప్తంగా 352 చర్చిలుండగా... వాటిలో ఒక్కో పాస్టర్‌కు రూ.5 వేలు చొప్పున వేతనాలు అందిస్తున్నారు. ఒక్కో నెలకు వీరి కోసం రూ. 17.60 లక్షలు వ్యయం చేస్తున్నారు. ఈ వేతనాలన్ని మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్నారు. అయితే జనవరి నెల నుంచి వేతనాలు పెండింగ్‌లో పడ్డాయి. ఏప్రిల్ నెల సగం గడిచిపోవడం, ఎన్నికల సమయం కావడంతో వేతనాలు అందుతాయో లేదోనన్న ఆందోళన పాస్టర్ల నుంచి వ్యక్తమవుతోంది.



మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం

ఐదేళ్లుగా ఇవ్వకుండా మోసం

ఐదేళ్లుగా పాస్టర్లకు వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసింది. ఎన్నికలకు ఏడాది ముందు నుంచి వేతనాలకు శ్రీకారం చుట్టారు. వాటిలో కూడా ఈ ఏడాది జనవరి నెల నుంచి మూడు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. ఎటుచూసినా రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్లకు తీరని అన్యాయం చేసింది.



- స్వామిదాస్, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున దగ్గుబాటి



ప్రచారంలో ప్రజలకు నమస్కరిస్తున్న దగ్గుబాటి ప్రసాద్

ఎమ్మెల్యే అధ్వాన పాలనకు రుద్రంపేటే నిదర్శనం

కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురంరూరల్, ఏప్రిల్ 15: ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అధ్వాన పాలనకు రుద్రంపేట పంచాయతీనే నిదర్శనమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని రుద్రంపేట పంచాయతీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. పూలమాలలు వేసి అభిమాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి మాట్లాడుతూ... తమకు ఎక్కడికి వెళ్లినా విశేష స్పందన కనిపిస్తోందన్నారు. తమ విజయం ఎప్పుడో ఖాయమైపోయిందన్నారు. కాలనీలో రజకుల సమస్యలు ఎక్కువగా కనిపించాయన్నారు. టీడీపీ హయంలో దోబీఘాట్లు నిర్మిస్తే వాటి నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక దోబీఘాట్లు నిర్మిస్తామన్నారు. కాలనీల్లో డ్రైనేజీలు, వీధిలైట్లు వేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, నాయకులు కొండవీటి సుధాకర్ నాయుడు, మాజీ మేయర్ స్వరూపా, మాజీ ఎంపీపీ శ్రీనివాస రెడ్డి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగాతే జస్వింతి, క్లస్టర్ ఇన్‌చార్జ్ గోపాల్ గౌడ్, నగర అధ్యక్షులు మారుతీ కుమార్ గౌడ్, కార్యదర్శి ముక్తియార్, మాజీ కార్పొరేటర్లు రాజారావు, భవాని, నాయకులు దళవాయి వెంకటనారాయణ, పోతుల లక్ష్మినరసింహులు, పంచాయితీ అధ్యక్షులు ఎస్ఎం బాషా, ఉపాధ్యక్షుడు వరుష్‌చౌదరి, కుమార్ నాయుడు, బాలప్ప, వెంకట, అంజి, నాగ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పతనం ప్రారంభం

బీసీలంతా మావైపే : మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఏప్రిల్ 15: వైసీపీ జెండాను మోసిన వారు, బీసీలు ఇప్పుడు తమ వైపు వస్తున్నారని, ఇక ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి పతనం ప్రారంభమైందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని అక్కంపల్లి పంచాయతీ సదాశివన్ కాలనీలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం పార్టీలోకి వస్తున్న వలసలు చూస్తుంటే కొన్ని గ్రామాల్లో వైసీపీకి ఏజెంట్లు కూడా ఉండే పరిస్థితి లేదన్నారు. ఊళ్లకు ఊళ్లే వైసీపీ నుంచి టీడీపీలోకి చేరుతున్నాయన్నారు. బీసీలకు న్యాయం చేసేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. గత ఎన్నికల్లో బీసీల్లో చాలా మంది వైసీపీకి ఓటు వేశారని, వారికి ఎలాంటి ప్రయోజనం కల్గిందని ప్రశ్నించారు. కనీసం ఒక్కరికైనా రుణమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. బీసీ ద్రోహిగా ఉన్న వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాలనీలోని వెంకటనారాయణ, రఘురామయ్య, వెంకటేష్ నాయక్, మస్తాన్, నారాయణప్ప, శంకర్ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 70 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, గాండ్ల విశాలాక్షి, మాజీ ఎంపీపీ మాధవి, కుమ్మర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, అనంతపురం, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, ప్రదీప్ కుమార్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాములాయి వెంకటేష్, మాజీ మండల కన్వీనర్లు లక్ష్మినారాయణ, జయకృష్ణ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మిదేవి, మాజీ ఎంపిటీసీ ఇమామ్‌ముల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు వన్నూరుస్వామి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

రామగిరి: రామగిరి మండలంలో వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు సోమవారం పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ల సమక్షంలో టీడీపీలో చేరారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రామగిరి వైస్ ఎంపీపీ సంపత్, గ్రీనిగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కట్టుబడి సరళ రామాంజినేయులు, మాదాపురం, నసనకోట పంచాయతీల నుంచి 15 వైసీపీ కుటుంబాల సభ్యులు టీడీపీలోకి చేరారు. వీరందరికి పరిటాల సునీత పార్టీలోకి ఆహ్వానించారు.

రాప్తాడు: యర్రగుంటలో వైసీపీకి చెందిన 11 కుటుంబ సభ్యులు టీడీపీలోకి చేరాయి. సోమవారం అనంతపురం నగరంలో పరిటాల క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత సమక్షంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో పరిటాల సునీత

రేకులకుంట గ్రామస్థులపై ఫిర్యాదు

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 15: మండలంలోని రేకులకుంట గ్రామ ప్రజలపై స్పిరిట్ కంపెనీ ఆర్‌జేసీ అగ్రోస్ యాజమాన్యం సోమవారం ఫిర్యాదు చేసింది. ఆ గ్రామం వద్ద ఉన్న ఆర్‌జేసీ అగ్రోస్ కంపెనీ ద్వారా గ్రామంలోకి విషవాయువులు, దాని నుంచి వెలువడే చెడు వ్యర్థాలతో గ్రామస్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని కొద్ది రోజులుగా గ్రామస్థులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. సోమవారం ఫ్యాక్టరీ వద్ద బోర్డు తీయడంతో పాటు ఫ్యాక్టరీ నిర్మాణ పనులు అడ్డగించారు. కంపెనీకి వెళ్లే రహదారిని తవ్వి నిరసన చేపట్టారు. దీంతో కంపెనీ యాజమాన్యం రేకలకుంట గ్రామానికి చెందిన 13 మందిపై పోలీసులుకు ఫిర్యాదు చేసింది. వీరిపై విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ఫ్యాక్టరీ నిర్మాణపు పనులు నిలిపి వేయలని మరింత ఆందోళన చేస్తామని ఆ గ్రామస్థులు తెలిపారు.

ఈనామ్ పేరుతో దోపిడీ ఆపాలి

అనంతపురం రూరల్, ఏప్రిల్ 15: ఈనామ్ పేరుతో ఏజెంట్లు దోచుకుంటున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం గార్లదిన్నెకు చెందిన కొంతమంది చీనీరైతులు జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయంలోని అధికారికి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. చీనీమార్కెట్‌లో బహిరంగ వేలం నిర్వహించాలన్నారు. నాలుగు శాతమే కమీషన్ తీసుకోవాలన్నారు. రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలని, అలాగే బయట వ్యాపారులనూ వేలానికి అనుమతించాలని అన్నారు. మార్కెట్ యార్డులోని ఏజెంట్లు మాత్రమే వేలంలో పాల్గొనే విధంగా చేయడం ద్వారా బయట వ్యాపారులు రావడం లేదన్నారు. పులివెందుల మార్కెట్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నారన్నారు. పులివెందుల, అనంతపురం మార్కెట్ యార్డుకి టన్నుకు దాదాపు రూ.5వేల నుంచి రూ.6వేలు తేడా ఉంటోందని అన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వాల్మీకి విద్యార్థులకు పురస్కారాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 15 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2023-24 ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వాల్మీకి, బోయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇస్తున్నట్లు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్య కుమార్, కోశాధికారి పవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రభుత్వ కళాశాల్లో చదివి 400 మార్కులు, ఆపైన, ప్రైవేట్ కళాశాలల్లో చదివి ...420 మార్కులు, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో ప్రభుత్వ కళాశాలల్లో చదువుతూ 850 మార్కులు, ఆపైన, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతూ...900 మార్కులు, ఆపైన సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ నెల 24వ తేదీలోగా తమ వివరాలను పంపాలన్నారు. ఆన్‌లైన్ మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను, ఫోన్ నెంబర్లతో సహా జత చేసి పంపాలన్నారు. ఆర్.సి. అక్కులప్ప (జిల్లా అధ్యక్షులు), వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం, డోర్ నెంబర్ 28-787, సంఘమేష్ నగర్, అనంతపురం చిరునామాకు దరఖాస్తులు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9440774519, 83090 90406 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

రాప్తాడు, ఏప్రిల్ 15: మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో మండలంలోని బండమీదపల్లి గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచి ప్రజలకు వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జరగలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇంటింటికీ సంక్షేమ పథకాలు, రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వెంకట్రాముడు, పక్కీర్‌రెడ్డి, కిష్టా తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 15: నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ధరణికిషోర్ సోమవారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల వేళ ఎలాంటి గొడవలు, అల్లర్లకు దిగరాదని సూచించారు. ప్రశాంతంగా జీవించాలని, పాత పంథా కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

లాడ్జిల్లో తనిఖీలు : నగరంలోని నాలుగో పట్టణ పోలీసులు లాడ్జిలు తనిఖీలు చేశారు. ఎస్ఐ నాగమధు సిబ్బందితో కలిసి లాడ్జిలను తనిఖీలు చేసి.. వాటి యజమానులకు పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, అనుమానాస్పదులు లాడ్జిల్లో బస చేస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

సమాజ సేవాసమితి జిల్లా అధ్యక్షుడిగా విశ్వరూప్



అనంతపురం సెంట్రల్: సమాజ సేవాసమితి జిల్లా అధ్యక్షుడిగా విశ్వరూప్ ఎన్నికయ్యారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య విశ్వరూప్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రజలు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన తనకు ఈ అవకాశాన్ని కల్పించినందుకు విశ్వరూప్ కృతజ్ఞతలు తెలిపారు.

18న నార్పలలో షర్మిల పర్యటన

శింగనమల, ఏప్రిల్ 15: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గురువారం నార్పలలో పర్యటిస్తారని, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ శింగనమల అభ్యర్థి సాకే శైలజనాథ్ అన్నారు. సోమవారం ఆయన శింగనమలలో మీడియాతో మాట్లాడుతూ... ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే... రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, రాంచరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

'వామపక్ష' వేదిక సమావేశం

శింగనమల దుర్గాంజనేయస్వామి గుడి వద్ద సోమవారం వామపక్ష లౌకిక ఇండియా వేదిక సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా సీపీఎం కార్యదర్శి రాంభూపాల్, కాంగ్రెస్ అభ్యర్థి సాకే శైలజనాథ్ మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే పార్టీనే గెలిపించాలని, బీజేపీకి కొమ్ముకాసే పార్టీలకు బుద్ధిచెప్పాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు ఓ.నల్లప్ప, బాలరంగయ్య, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, కృష్ణమూర్తి, సూరి, మల్లికార్జున, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు, ఏప్రిల్ 15: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి తెలిపారు. సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు.

శాస్త్రోక్తంగా సామూహిక ధర్మోపనయనాలు



సామూహిక ధర్మోపనయనాలు నిర్వహిస్తున్న పండితులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15 : బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం ఆధ్వర్యంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సోమవారం సామూహిక ధర్మోపనయనాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 18 మంది వటువులు హాజరై ఉపనయనాలు చేయించుకున్నారు. వేదపండితులు ముక్కాల విద్యాధరశాస్త్రి, కోడూరు అమర్‌నాథ్‌శర్మ నేతృత్వంలో అర్చకబృందం వేదమంత్రాలు వల్లిస్తూ వటువులకు బ్రహ్మోపదేశం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో శంకరాచార్యుల ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు చేసి.. పూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదన అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో పెద్దఎత్తున అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఉపనయన సేవాసంఘం అధ్యక్షుడు యన్.శివరామ్, కార్యదర్శి సాయిశివరాం, సహాయ కార్యదర్శి రఘురామారావు, ఎస్‌వీ రమణరావు, హోసూరు రామసుబ్రహ్మణ్యం, రవికుమార్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై కేసులు వేయండి : కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 15: ఎన్నికల కోడ్‌ను ఎవరు ఉల్లంఘించినా వారిపై వెంటనే కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నోడల్ అధికారులు, రిటర్నింగ్ ఆఫీసర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులను ప్రతి ఒక్కరూ నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఏ ఫిర్యాదు వచ్చినా రిటర్నింగ్ అధికారుల స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఏమైన ఫిర్యాదులొస్తే ఆర్‌ఓలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబరు కేటాయించాలని, ఆ ఫోన్ నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఫారం-6,7,8 ఫిర్యాదులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ ఫైఖోమ్ నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, నోడల్ ఆఫీసర్లు, ఆర్‌ఓలు పాల్గొన్నారు.

మరింత అప్రమత్తంగా ఉండాలి : కలెక్టరేట్‌లో ఎన్నికల పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ మరింత అప్రమత్తంగా పనిచేయాలని నోడల్ అధికారులకు కలెక్టరు సూచించారు. సోమవారం ఆయన ఆ విభాగం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏ రిపోర్టు అడిగినా కంట్రోల్ రూమ్ నుంచి వెంటనే అందించాలన్నారు. నియోజకవర్గాల వారీగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. 24 గంటలు పనిచేసే ఈకంట్రోల్ రూమ్ సిబ్బందిని మూడు షిఫ్టుల పద్ధతిలో ఉండేలా చూడాలన్నారు. నోడల్ అధికారులు కమాండ్‌కంట్రోల్ రూమ్స్‌ను పర్యవేక్షించాలన్నారు.

కొనసాగిన అగ్నిమాపక వారోత్సవాలు



ఆర్టీసీ బస్టాండ్‌లో ఫైర్ సిబ్బంది విన్యాసాలు

అనంతపురం న్యూ టౌన్, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో అగ్నిప్రమాదాలు నివారణపై సిబ్బంది విన్యాసాలు చేపట్టి అవగాహన కల్పించారు. అందులో భాగంగా క్లాక్‌టవర్, రైల్వే స్టేషన్ సర్కిల్, కోర్టు రోడ్డు కూడలి, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఫైర్ సిబ్బంది విన్యాసాలు చేశారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ అగ్నిమాపక శాఖ అధికారి లింగమయ్య మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది వెంకటరామయ్య, వెంకటేశులు, రవికుమార్ నాయక్, వీరేష్‌గౌడ్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాసనాయుడు, అంకిరెడ్డి, తిరుపాల్, నరేష్, శివతేజ పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల బకాయి వేతనాలు, పీఎఫ్‌ను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల్లో కోత విధించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డి రాయదుర్గం, కళ్యాణదుర్గం కార్మికులకు రావాల్సిన వేతనంలో ఒక్కొక్కరి నుంచి రూ.2వేలు కోత విధించడంతో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్‌లో ఫేస్-4 రాయదుర్గం, కళాణదుర్గం కార్మికులు గత 15 సంవత్సరాలుగా 600 గ్రామాల ప్రజలకు 280 మంది కార్మికులు నిరంతరం తాగునీరం దిస్తున్నారన్నారు. వీరికి 2022 నుంచి కాంట్రాక్టర్ శివారెడ్డి రూ.16,500 వేతనం, రూ.1,500 పీఎఫ్‌తో కలిపి మొత్తం 18వేలు ఇచ్చేవారన్నారు. ప్రస్తుత కాంట్రాక్టర్ శివశంకర్ రెడ్డి కేవలం రూ.14,250 మాత్రమే వేతన మిస్తున్నాడని, పీఎఫ్ కట్టడం లేదని పేర్కొన్నారు. వేతనం కూడా ఈనెల 12న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో చెల్లించాడని పేర్కొన్నారు. అందు లోనూ 20 మంది కార్మికులకు ఇప్పటికీ వేతనాలు జమ చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్ శివశంకర్‌రెడ్డికి ఎలాంటి అనుభవమూ లేదని, అందువల్లనే కార్మికుల గోడు ఆయనకు పట్టలే దని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు ఎలాంటి కోతలు లేకుండా పూర్తి వేతనం చెల్లించి, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి రాము, ఒన్నూరుస్వామి, నరేష్, అశోక్, రమేష్, ప్రకాష్, చిత్తప్ప, రాందాస్, శివ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు

గార్లదిన్నె, ఏప్రిల్ 15: ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబునాయుడికే ఉందని, ప్రతిఒక్కరూ టీడీపీకి ఓటేసి గెలిపించాలని శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కల్లూరు పంచాయతీ పరిధిలోని ఎగువపల్లిలో శింగనమల నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ సోదరి బండారు కిన్నెరశ్రీ, స్థానిక టీడీపీ నాయకులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకన్న, బాబయ్య, వడ్లరాము, చింతా వెంకట్రాముడు, సామాల మధు, ఆశోక్, చల్లారాజు, నల్లపరెడ్డి, నాగేంద్ర, రామచంద్ర, ఎల్ఐసీ ఆదినారాయణ పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలపించండి

నార్పల : అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిని అత్యధిక మెజార్టీతో గెలపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు పేర్కొన్నారు. నార్పల మండలం కేసేపల్లిలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాలకు న్యాయం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల ఆంజనేయులు, పిట్టు రంగారెడ్డి, ఆలం నాగార్జుననాయుడు, ఎర్రినాగప్ప, మోహన్, చంద్రబాబు, లక్ష్మీనాయుడు, కేశవరెడ్డి, పుల్లయ్య, నాగేంద్ర, శ్రీరాములు, రామాంజులరెడ్డి, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జాఫర్, రాజన్న, ఆదినరసింహ, పీఎల్ లక్ష్మీనారాయణ, తలారి కుల్లాయప్ప, సత్తి పాల్గొన్నారు.



ఎగువపల్లిలో ప్రచారం చేస్తున కేశవరెడ్డి, బండారు కిన్నెరశ్రీ, నాయకులు

ప్రభాకర్ చౌదరికి పలువురి శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 15 : మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించడంతో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఆయన నివాసానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ నేతకు పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు. ప్రభాకర్ చౌదరి సహకారంతో ఈ ఎన్నికల్లో అనంత అర్బన్‌లో టీడీపీ జెండాను ఎగురవేస్తామన్నారు. అలాగే వైకుంఠంకు మేయర్ గంపన్న, టీడీపీ నాయకులు డిష్ నాగరాజు, దేవళ్ల మురళి, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, మారుతీకుమార్ గౌడ్, కుంచెపు వెంకటేష్, పీఎం లక్ష్మీప్రసాద్, బంగి నాగ, గోపాల్ గౌడ్, బాలప్ప, అజీజ్, చేపల హరి, గంగవరం అంజి, డిస్కో బాబు, రాయల్ రఘునాథ్, మన్సూర్ అలీ, బొమ్మినేని శివ, జేఎం బాషా, పూల బాషా, తెలుగు మహిళలు స్వప్న, విజయశ్రీరెడ్డి, సరళ, మణెమ్మ, వసుంధర, హసీనా, దళిత సంఘాల నాయకులు నారాయణస్వామి, చెన్నకేశవులు, సత్యకుమార్ శుభాకాంక్షలు తెలిపారు.



ప్రభాకర్ చౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న దగ్గుబాటి ప్రసాద్

వైసీపీకి దిమ్మతిరిగేలా బుద్ధిచెప్పండి

● కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం



మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్15: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులకు ఓటువేసి వైసీపీకి దిమ్మతిరిగేలా బుద్ధిచెప్పాలని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం ఓటర్లను కోరారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఎన్ తిమ్మాపురం గ్రామంలో టీడీపీ నాయకులు ప్రజాగళం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జయరాం మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేతగానితనం, జగన్ స్వార్థం కారణంగా రాష్ట్రం అధోగతి చెందిందన్నారు. ఎక్కడచూసినా కబ్జాలు, ఇసుక దందాలతో దోపిడీ చేశారన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు కేసీ హరి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, ఓ రామాంజనేయులు, మహదేవ్ పాల్గొన్నారు.

గుత్తి: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఫ్యాన్ రెక్కలు ఊడి కింద పడటం ఖాయమని గుమ్మనూరు జయరాం అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక సితార ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా నష్టపోయారన్నారు. బండారు ఆనంద్, గుమ్మనూరు నారాయణ, గాజులపల్లి హనమంతరెడ్డి, న్యాయవాది సోమశేఖర్, సుధాకర్‌నాయుడు, పాటిల్ సురేష్ పాల్గొన్నారు.

ఎవరు అక్రమార్కులో గుర్తించండి



పామిడిలో జయరాంకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

పామిడి: గుంతకల్లు నియోజకవర్గంలో ఎవరు అక్రమార్కులో గుర్తించాలని, తనపైన ఆలూరు నియోజకవర్గంలో ఎక్కడైనా ఒక్క కేసు కూడా నమోదు కాలేదని గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని కల్యాణ వేదికలో సోమవారం రాత్రి ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... వైసీపీ తనపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. ఇందులో వాస్తవాలు ఏ మిటో మీరే ఆలూరు నియోజకవర్గంలో విచారించుకోవచ్చన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కిరణ్‌గౌడ్, టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు, మాజీ జడ్పీటీసీ దాసరి లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

వంద కుటుంబాలు చేరిక: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ, నారాయణ స్వామివీధి(సంతమార్కెట్)లో వంద కుటుంబాలు సోమవారం రాత్రి జయరాం సమక్షంలో టీడీపీలోకి చేరాయి. ముందుగా 44వ జాతీయ రహదారిలో 4వ వార్డు ఇన్‌చార్జి రవి ఆధ్వర్యంలో గజమాలతో ఘన స్వాగతం పలికారు.

జయనగర్ కాలనీలో జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటన



కాలనీలో పర్యటిస్తున్న అశ్మిత్‌రెడ్డి, టీడీపీ నాయకులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 15: పట్టణంలోని జయనగర్‌కాలనీలో సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి విస్తృతంగా పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లిన ఆయన ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సూపర్‌సిక్స్ పథకాలతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు చింబిలి ప్రసాద్‌నాయుడు, కౌన్సిలర్ విజయ్‌కుమార్, లింగం కృష్ణ, వాసుదేవరెడ్డి, గంగాధర్ తదితరులు ఉన్నారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీలో సోమవారం జేసీ అశ్మిత్‌రెడ్డి తరఫున కాకర్ల బ్రదర్స్ రంగనాథ, జయుడు, రంగనాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సైకిల్‌గుర్తుకు ఓటువేసి అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

22 కుటుంబాలు టీడీపీలో చేరిక: స్థానిక నివాసంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన 22 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. దాసరి శ్రీనివాసులు, వెంకటనారాయణ, రాజశేఖర్‌రెడ్డి, మునిస్వామి, ఆది, సుధాకర్, వెంకటేష్, నారాయణస్వామి ఉన్నారు.

టీడీపీ అభ్యర్థి శ్రావణిశ్రీ ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న బండారు శ్రావణిశ్రీ

యల్లనూరు, ఏప్రిల్ 15: మండలంలో సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లి, శింగవరం, దంతలపల్లి, కల్లూరు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. ఆమె వెంట ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ నాయకులు ఉన్నారు.

వైసీపీ అసమ్మతి నేతలతో మంతనాలు



నాయకులతో చర్చిస్తున్న ఆలం, ముంటిమడుగు

యల్లనూరు, ఏప్రిల్ 15: మండలంలోని దంతలపల్లి గ్రామంలో వైసీపీ అసమ్మతి నేతలతో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి సోమవారం మంతనాలు జరిపారు. ప్రచారం నిమిత్తం గ్రామానికి వచ్చిన వారు టీడీపీవైపు వైసీపీ అసమ్మతి నాయకులు మొగ్గుచూపుతున్నారని తెలిసి వారింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించారు. పార్టీలోకి వస్తే మంచి గుర్తింపు ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. ఆదినారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు మరికొంతమంది కలిసి త్వరలోనే పార్టీలో చేరుతామని తెలిపినట్లు రామాంజనేయులు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 15: పట్టణంలోని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌జేడీ సీతః జోన్4 లింగారెడ్డి సోమవారం సందర్శించారు. ఓటీఎల్పీ, ఎఫ్ఆర్ఎస్‌ను ఉపయోగిస్తున్న విధానాన్ని ఆయన తెలుసుకున్నారు. కళాశాల నాక్‌కు వెళ్తున్న సందర్భంగా డిగ్రీ అడ్మిషన్లను ఏవిధంగా చేపట్టాలి అనే విషయంపై చర్చించారు. ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థుల రోడ్‌షోకు జనం కరువు



నేమకల్లులో రోడ్‌షోలో కనిపించని జనం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 15: మండలంలోని నేమకల్లులో రాయదుర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకర్‌నారాయణలు సోమవారం మధ్యాహ్నం నిర్వహించిన రోడ్‌షో జనం లేక వెలవెల బోయింది. నేమకల్లు, కురవల్లి, సిద్ధరాంపురం గ్రామాలలో జనం లేకపోవడంతో ఎంపీ అభ్యర్థి అసహనం వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన నాయకులకే అభ్యర్థులు గాలిలో చేతులు ఊపడంతోనే సరిపెట్టారు.

లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, ఏప్రిల్ 15: రాయదుర్గం నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని గంగలాపురం గ్రామంలో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో భైరవాన్‌తిప్ప, జీడిపల్లి ప్రాజెక్టులతో పాటు హెచ్చెల్సీ కాలువ ఆధునీకరణ చేయడంతో పాటు ఉంతకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు నీరందించడమే ధ్యేయమన్నారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలనే దృఢసంకల్పంతో చంద్రబాబు ఉన్నారన్నారు. లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, మహేష్, రవి, జగన్నాథ్, వేలూరు మరియప్ప, కోళకుర్తి సుదర్శన్, మాల్యం ప్రభాకర్, ఆది, బాయినేని నవీన్, ఎస్‌కే మల్లికార్జున, సూరి, రామప్ప, మారుతి, చాంద్‌బాషా, చంద్రశేఖర్‌గుప్తా, ఈరప్ప, కురుబ నాగరాజు, సలీం, బీజేపీ సత్యనారాయణరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.



టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాలవ భరత్



గంగలాపురంలో హారతులతో కాలవకు స్వాగతం పలుకుతున్న మహిళలు

జగన్‌ను గద్దె దించడమే ధ్యేయం

గుమ్మఘట్ట: జగన్‌ను గద్దె దించడమే మనందరి ధ్యేయమని రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఉదయం భూపసముద్రం, ఎర్రంపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని, పెద్ద ఎత్తున సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కన్వీనర్ గిరిమల్లప్ప, కాలవ భరత్, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, సంజీవ, కేపీదొడ్డి నాగరాజు, స్థానిక నాయకులు గోవిందప్ప, వెంకటేశులు, వన్నూరుస్వామి, దేవరాజ్, బషీర్ పాల్గొన్నారు.

పది కుటుంబాలు టీడీపీలో చేరిక

రాయదుర్గంరూరల్: మండలంలోని కదరంపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సోమవారం పార్టీ కార్యాలయంలో యువనాయకుడు కాలవ భరత్ వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో వారు టీడీపీలో చేరారు. జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్, సోమశేఖర్, గురుమూర్తి పాల్గొన్నారు.

జయరాంకు సంపూర్ణ మద్దతు: జితేంద్రగౌడ్



జయరాంకు పార్టీ నాయకులను పరిచయం చేస్తున్న జితేంద్రగౌడు

గుంతకల్లు, ఏప్రిల్ 15: ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాంకు తాను, తన కుటుంబ సభ్యులు ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే ఆర్ జి తేంద్రగౌడు స్పష్టం చేశారు. సోమవారం ఉదయం జయరాం జితేంద్రగౌడు ఇంటికి వెళ్లి ఆయన కుటుంబీకులతో భేటీ అయ్యారు. జితేంద్రగౌడు జయరాంకు సాదరంగా ఆహ్వానించారు. రెండు గంటలసేపు ఆయనతో చర్చించి, తన మద్దతుదారులను జయరాంకు పరిచయంచేశారు. జితేంద్రగౌడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా అందరూ పనిచేయాన్నారు. ఆర్ శ్రీనాథ్ గౌడు, హరినాథ్ గౌడు, పవన్ కుమార్ గౌడు, అనిల్ కుమార్ గౌడు, గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు నారాయణ, టీ కేశప్ప, బండి లక్ష్మీదేవి, అంజలీ దేవి పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 13 కుటుంబాలు

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 15: మండలంలోని తీటకల్లు గ్రామానికి చెందిన 13 కుటుంబాలు వైసీపీని వీడి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో పసుపు కండువాలు కప్పుకుని టీడీపీ తీ ర్థం పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరిన కుటుంబాలకు సురేంద్రబాబు కం డువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పాలవెంకటాపురం పంచాయతీలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. గ్రామానికి చెందిన కృష్ణమూర్తి, క్రిష్టప్ప, చిత్తప్పలు పార్టీ కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో చేరారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో సోమవారం వైసీపీకి చెందిన పలువురు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ సీనియర్ నాయకులు సూర్యముని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నారాయణస్వామి, రామాంజి, బాలరంగ, కంబగిరి స్వామి, మద్దిలేటి, నాగన్న, రాము, పెద్దిరాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగనాథ్‌రెడ్డి, గంగాధర్, సీపీఐ గంగరాజు పాల్గొన్నారు.

వలంటీర్ టీడీపీలో చేరిక

గుమ్మఘట్ట, ఏప్రిల్ 15: మండలంలోని భూపసముద్రం గ్రామంలో సోమవారం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన వలంటీర్ జ్యోతి భర్త హనుమంతరాయుడు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కన్వీనర్ గిరిమల్లప్ప, సర్పంచ్ సదాశివ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆయనకు కాలవ శ్రీనివాసులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కరువు మండలాల ప్రకటనే తప్ప.. సాయం లేదు

● కాంగ్రెస్ పార్టీ తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థి నాగిరెడ్డి

యాడికి, ఏప్రిల్ 15: వైసీపీ ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిందేగానీ సహాయం అందించడంలో విఫలమైందని తాడిపత్రి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగిరెడ్డి విమర్శించారు. సోమవారం యాడికిలో పర్యటించిన ఆయన సీపీఐ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సరిగా పడక పంటల దిగుబడి లేక రైతులు అప్పులపాలయ్యారన్నారు. రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించిందే కాని నిధులు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి జూటూరు రఫీ, సహాయ కార్యదర్శి వడ్డెరాముడు, రాఘవ, నారాయణరెడ్డి, నాగరంగయ్య, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

తలారి రంగయ్యను ఓడించడమే లక్ష్యం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 15: కళ్యాణదుర్గం వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్యను ఓడించడమే తమ లక్ష్యమని ఎస్సీ, ఎస్టీ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని కరణం భవన్‌లో ఎస్సీ, ఎస్టీల జేఏసీ ఆధ్వర్యంలో అంతర్గత సమావేశాన్ని నిర్వహించారు. వారం రోజుల క్రితం శంకర్‌నాయక్‌పై దాడి చేయడంతో, అందుకు ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు రంగయ్య నుంచి ప్రాణహాని ఉందన్నారు. ఆయనను ఓడించడమే జేఏసీ లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం 8 మంది సభ్యుల జాయింట్ యాక్షన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజలకు న్యాయం చేసే నేత చంద్రబాబు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 15: రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం చేసే నాయకుడు చంద్రబాబునాయుడు అని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎల్‌బీనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో కాలవ శ్రీనివాసులుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ బలరాంరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, కుమ్మరి మల్లికార్జున, వాణిజగన్నాథ్‌రెడ్డి, వెంకటేశులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లి, గురువేపల్లి, మల్లాపురం గ్రామాల్లో టీడీపీ ఎస్సీసెల్ కన్వీనర్ వెట్టి హనుమంతరాయుడు ఆధ్వర్యంలో దళిత నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు ఓటు వేయాలని సోమవారం ప్రచారం చేశారు. మాజీ ఎంపీపీ దీనమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి శివలింగప్ప, గోపాల్, తిమ్మరాజు, పెద్ద వన్నూరుస్వామి, నాగరాజు, దుర్గన్న, మారెన్న, చెన్నకేశవులు, గంగాధర, కిష్టప్ప పాల్గొన్నారు.

సైకిల్‌గుర్తుకు ఓటువేసి గెలిపించండి

పెద్దవడుగూరు: సైకిల్‌గుర్తుకు ఓటువేసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని గెలిపించాలని మండల నాయకులు కొండూరు కేశవరెడ్డి, వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని బందార్లపల్లి, ముప్పాలగుత్తి, లక్షుంపల్లి, మేడిమాకులపల్లి గ్రామాల్లో సోమవారం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీటీసీ చిన్నగోవిందు, నాగరాజు, నాగేశ్వరరెడ్డి, రామాంజనేయులు, రామాంజిరెడ్డి, ఇటుకనాల, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కసాపురంలో పునర్వసు పూజలు



అలంకరణలో స్వామివార్లు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 15: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం పునర్వసు పూజలను నిర్వహించారు. వేకువజామున అర్చకులు స్వామి వారి మూలవిరాట్టుకు బంగారు కవచం వజ్రకిరీటాన్ని ధరింప జేసి ప్రత్యేక పూజలను చేశారు. వేద పండితులు, అర్చకులు ఆలయంలోని యాగశాలలో సీతారామచంద్ర ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి తిరుమంజన స్నపనం నిర్వహించారు. భక్తలకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గుర్రప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 15: మండలంలోని యర్రగుంటపల్లిలో సోమవారం గుర్రప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా జరిగింది. ప్రతిష్ఠహోమం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

యాడికి: మండలంలోని పిన్నేపల్లి గ్రామంలో సోమవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి

● కలెక్టర్ వినోద్‌కుమార్



ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 15: ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం పట్టణంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. పట్టణ శివారులోని గాలిమారమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన బోర్డర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అనంతరం బాలగంగాధర్ తిలక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని, ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను తనిఖీ చేశారు. ఓటుహక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహనలో భాగంగా వినాయకసర్కిల్ నుంచి పాతబస్టాండ్, లక్ష్మీబజార్, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వరకు కేంద్ర బలగాలతో మార్చ్‌పాస్ట్ నిర్వహించి ర్యాలీలో పాల్గొన్నారు. జడ్పీ సీఈఓ వైభోంనిదియాదేవి, ఆర్డీఓ కరుణకుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, తహసీల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించుతాం

యాడికి, ఏప్రిల్15: మాదిగలను మోసం చేసిన వైసీపీని గద్దె దించుతామని ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథ్ తెలిపారు. సోమవారం యాడికిలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలపై వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. ఎన్డీయే కూటమికి తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 15: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం కార్మికులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పండుగ బోనస్, ఫిబ్రవరి హెల్త్ అలవెన్సులు, మార్చి జీతం ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సరిగా జీతాలు ఇవ్వకపోవడంతో పండుగ పూట కూడా పస్తులు వుండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, హనుమాన్ సర్కిల్, అజంతా, ఎన్టీఆర్ సర్కిల్‌లో అగ్నిప్రమాదాలపై ప్రజలకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర వాటిని వివరించారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి కరపత్రాలను అందజేశారు. అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి ఎన్ అశ్వర్థ, సిబ్బంది ప్రతాప్‌నాయక్, లోకేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, లోకేష్‌నాయుడు, కృష్ణ, నూర్‌బాషా పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని అశోక్‌పిల్లర్, పోలీస్‌స్టేషన్ సర్కిల్, యల్లనూరురోడ్డు సర్కిళ్లలో ఫైర్‌శాఖ అధికారి మోహన్‌బాబు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల నుంచి బయటపడేందుకు ఎలా వ్యవహరించాలో ప్రాక్టికల్‌గా చేసి చూపించారు.

బలవంతంగా వైసీపీ కండువా వేశారు



టీడీపీ కండువా వేస్తున్న పయ్యావుల మోహన్‌బాబు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 15: నీతో మాట్లాడే పని ఉంది ఇంటి దగ్గరికి రండి అని పిలిచి బలవంతంగా వైసీపీ కండువా వేశారని నాగేంద్ర, పాలాక్షి, బసవరాజు, మల్లికార్జున అన్నారు. సోమవారం మధ్యాహ్నం బొమ్మనహాళ్‌లో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి టీడీపీకి చెందిన కురుబసామాజిక కుటుంబాలకు వైసీపీ కండువాలు వేయడంతో వారు మనస్సు మార్చుకోలేక తిరిగి సాయంత్రం టీడీపీ నాయకుడు పయ్యావుల మోహన్‌బాబు సమక్షంలో టీడీపీ కండువా వేసుకున్నారు. కార్యక్రమంలో పయ్యావుల అనిల్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

● ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్





మాట్లాడుతున్న కేశవ్, అంబికా లక్ష్మీనారాయణ



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఉరవకొండ, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో సోమవారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి బీజేపీ, జనసేన కూటమి నాయకులు హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తనయుడు విక్రమ్ సింహ కార్యకర్తల మధ్యలోనే కూర్చున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతోందని.. నాయకులు, కార్యకర్తలు అలసత్వం వీడి సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో గెలిచి ఉరవకొండ చరిత్రను తిరగరాద్దామన్నారు. 1994 ఎన్నికల ఫలితాలే 2024లోనూ పునరావృతం కావాలన్నారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన అంతమొందించేందుకే కూటమి కలయిక అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తారని, వైసీపీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. వైసీపీ కుట్రలను కార్యకర్తలకు వివరించారు. నియోజకవర్గంలో విశ్వేశ్వరరెడ్డి ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. అభివృద్ధి జరిగిందంటే టీడీపీ హయాంలోనే అన్నారు. చెరువులకు నీళ్లు ఇచ్చాంది. మీమే, ఉరకొండలో 3వేలు పట్టాలు పంపిణీ చేసిన ఘనత టీడీపీదేనన్నారు. 18వేల ఇళ్లు మంజూరు చేయించామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ నుంచి జీబీసీకి నీటిని మళ్లించినప్పుడుగా లస్కర్‌గా పనిచేశారన్నారు.

అరాచకపాలన అంతమొందిద్దాం: అంబికా

అరాచకపాలన అంతమొందించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఈ చారిత్రాత్మక ఎన్నికల్లో సీఎంగా చంద్రబాబును గెలుపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. 2019 ఎన్నికల్లో జరిగిన పొరపాటు చేయడం వల్ల రాష్ట్రం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, బీజేపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీలు కొనకొండ్ల రాజేష్, గౌతమ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, మండల కన్వీనర్లు విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు, ప్రసాద్, బీడీ మారయ్య, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ ఎంపీపీలు ప్రతాప్‌నాయుడు, సుంకరత్నమ్మ, టీడీపీ నాయకులు బీమలింగప్ప, దేవేంద్రప్ప, గోవిందు, మల్లికార్జున, మురళి, నాగేంద్ర, దస్తగిరి, వలి, నాగన్న, వన్నూరుస్వామి, మండి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

మహిళలపై కేసులు పెట్టించిన ఘనత పెద్దారెడ్డిదే

● మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 15: సాధారణంగా రాయలసీమలో ఆడవారిపై కేసులు పెట్టరని ఒక్క తాడిపత్రిలోనే వారిపై కేసులు పెట్టించిన ఘనత వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికే దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక నివాసంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనను స్క్రాప్ దొంగ అంటూ వైసీపీ నాయకులు పలుమార్లు మాట్లాడుతున్నారని అన్నారు. బీఎస్4వాహనాల కేసులో పోలీసులు వేసిన చార్జీషీట్ సరిగాలేదని కోర్టు తిరిగి పోలీసులకు పంపిందన్నారు. ఎమ్మెల్యేకు చేతనైతే తమపై తిరిగి కేసులు నమోదు చేయించాలని సవాల్ విసిరారు.

టీడీపీ గెలుపునకు సహకరించాలి



మాట్లాడుతున్న బోరంపల్లి ఆంజనేయులు

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 15: రాయదుర్గం నియోజకవర్గంలో ఉన్న కురుబ కులస్థులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు గెలుపునకు సహకరించాలని కురుబసంఘం అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో కురుబల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కురుబలు ఐకమత్యంతో ముందుకెళ్లాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పుట్లూరు, ఏప్రిల్ 15: మండలంలోని కడవకల్లు గ్రామంలో చంద్రకళ (33) అనే మహిళ ఇంటిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. నంద్యాలజిల్లా బనగానపల్లెకు చెందిన చంద్రకళను కడవకల్లుకు చెందిన చిన్నన్నకి ఇచ్చి పదేళ్లక్రితం వివాహం చేశారు. ఆదివారం ఉదయం భర్త ఇంటి నుంచి పనినిమిత్తం బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తలుపు తట్టాడు. ఎంతసేపటికి తీయకపోవడంతో కూలీపనికి వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చి మళ్లీ తలుపు తీయాలని కేకలు వేశాడు. అరిచినా తీయకపోవడంతో అనుమానం వచ్చి ఇతరుల సాయంతో తలుపును బద్దలు కొట్టాడు. అప్పటికే విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి కన్నీరుమున్నీరయ్యాడు. ఒంటిపైన ఎలాంటి గాయాలు లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలికి సంతానం లేదు. సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ఐదుగురి అరెస్ట్

యాడికి, ఏప్రిల్ 15: వేర్వేరు కేసులకు సంబంధించి తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురిని వీరన్నపల్లి గ్రామానికి చెందిన ఇద్దరిని సోమవారం అరెస్ట్‌చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. తిప్పారెడ్డిపల్లి గ్రామంలో ఇంటిముందు కసువు విషయంలో గొడవపడిన సంఘటనలో బాధితుడి ఫిర్యాదుమేరకు మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లీశ్వరరెడ్డిలపై కేసునమోదు చేసి అరెస్ట్‌చేశామన్నారు. వీరన్నపల్లి గ్రామంలో గొడవపడ్డ సంఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు బాలనారాయణ, ఓబులమ్మలపై కేసునమోదుచేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

యాచకుడి మృతి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 15: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సోమవారం యాచకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన మేరకు యాచకుడు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో యాచిస్తూ జీవనం సాగించేవాడు. అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు.

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 15: మండలంలోని చిత్రచేడు గ్రామానికి చెందిన రైతు వన్నూర్‌వలి విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు రైతు వన్నూర్‌వలి సోమవారం పొలంలో వరిమడి పంటను కోస్తుండగా చేయి పైకి ఎత్తడంతో విద్యుత్‌తీగలు తాకి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బెళుగుప్ప, ఏప్రిల్ 15: మండలంలోని దుద్దేకుంటలో సోమవారం 130 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించామన్నారు. గ్రామశివార్లలో బాక్స్‌లు పడవేసి ఉడాయించారని త్వరలోనే గుర్తించి నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

ఉత్తరాది మఠం నిర్మాణానికి రూ.40 లక్షల విరాళం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 15: మండలంలోని గ్రామదట్లకు చెందిన మారుతీశ్వరరావు కుమారుడు భీమసేన్‌రావు, హనుమేష్‌రావు, రమేష్‌రావు పట్టణంలోని కోట ప్రాంతంలో ప్రసిద్ధిచెందిన ఉత్తరాది మఠం నూతన భవన నిర్మాణానికి రూ.40 లక్షలు విరాళం ప్రకటించారు. ఇప్పటికే ఉత్తరాది మఠం పీఠాధిపతి 1008 సత్యాత్మతీర్థుల స్వాములకు రూ.30 లక్షల విరాళాన్ని అందించినట్లు తెలిపారు. మిగిలిన రూ.10 లక్షలు కోట ప్రాంతంలో అభివృద్ధి పనులకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.

దర్గా నిర్మాణానికి..: మండలంలోని జుంజురంపల్లి గ్రామానికి చెందిన పరతన్న గారి కుమారుడు ప్రకాష్ హజరత్ సయ్యద్ షా వలి దర్గా నిర్మాణానికి రూ.51,001లను విరాళం అందించారు. దర్గా నిర్మాణంలో భాగంగా ప్రహరీ నిర్మాణానికి నగదును అందించారు.